


గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రాథమిక విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. జీవో 117 తీసుకొచ్చి ఉన్నత పాఠశాలలతో పలు ప్రాథమిక పాఠశాలలను విలీనం చేసింది. ఈ నిర్ణయం.. విద్యార్థులకు శాపంగా మారింది. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులను అవస్థలకు గురిచేసింది. ఇలా ప్రాథమిక విద్యను గాడి తప్పేలా చేసిన విలీనం జీవోను రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. దీంతో ప్రాథమిక పాఠశాలలకు మళ్లీ మంచి రోజులు రానున్నాయి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

ప్రాథమిక విద్యకు మళ్లీ మంచి రోజులు!

- 117 జీవో రద్దు నిర్ణయంతో మళ్లీ తెరచుకోనున్న 814 ప్రాథమిక పాఠశాలలు
- గ్రామీణ విద్యార్థులకు తప్పనున్న ఇబ్బందులు

అభినందనీయం



జీవో 117ను రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయం. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ జీవో కారణంగా ప్రభుత్వ విద్యారంగం అతలాకుతలమైంది. విద్యాప్రమాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉపాధ్యాయులూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

- ఎస్.బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టు

117 జీవో ప్రాథమిక విద్యకు గొడ్డలి పెట్టులాంటిది. దాని వల్ల ప్రాథమిక విద్య అస్తవ్యస్తమైంది. తిరిగి గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషం. గత ప్రభుత్వం తరహాలో ఏకపక్షంగా కాకుండా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి నిర్ణయాలు చేయడం హర్షణీయం.

- బండి మధుసూదన్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి



నూతన విద్యావిధానం 2020ని ఆసరా చేసుకుని కేంద్రం నుంచి భారీగా నిధులు రాబట్టుకునే లక్ష్యంతో 25కు పైగా రాష్ట్రాలు పక్కన పడేసిన విద్యావిధానాన్ని గత వైసీపీ ప్రభుత్వం 117 జీవో రూపంలో తీసుకొచ్చింది. దీని ప్రకారం హైస్కూల్‌కు మూడు కిలోమీటర్లలోపు దూరమున్న ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయాలి. కానీ ఉమ్మడి జిల్లాలో ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న 814 పాఠశాలలను 430 ఉన్నత పాఠశాలల్లో మూడు విడతల్లో విలీనం చేశారు. ఆ లెక్కన 814 బడులు మూతపడ్డాయి. ఇక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 98 కంటే తక్కువగా ఉంటే స్కూల్ అసిస్టెంట్ పోస్టు లేకుండా చేసింది. 6 నుంచి 10వ తరగతి వరకున్న ఉన్నత పాఠశాలల్లో 93 మందికన్నా తక్కువ విద్యార్థులున్నచోట, అలాగే 3 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఉన్నత పాఠశాలల్లో 137 కంటే తక్కువ విద్యార్థులు ఉన్నచోట గ్రేడ్-2 హెడ్‌మాస్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులను తీసేసింది. దీంతో హెచ్‌ఎం లేని పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడి విద్యాబోధన గాడితప్పింది. ఇలా అసంబద్ధ సర్దుబాట్లతో వేలాది ఉపాధ్యాయ పోస్టులను మిగులు చూపించింది. మరోవైపు మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులు సుమారు 2,500మంది ఉన్నత పాఠశాలలకు తరలివెళ్లి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలా ఇబ్బందులకు గురిచేసిన ఈ జీవో పూర్తిగా రద్దయితే విలీనంతో మూతపడిన ప్రాథమిక పాఠశాలలు మళ్లీ తెరచుకోనున్నాయి. గ్రామీణ పిల్లలకు విద్య అందడంతోపాటు.. ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడతాయి. భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ మరోసారి ఇచ్చే అవకాశముంది.

నష్టాలెన్నెన్నో..

- జీవో 117 ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లోని 3 నుంచి 5 తరగతులను మూడు కిలోమీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు దూరాభారం పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఇక్కట్ల పాలయ్యారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ఎవరి తోడూ లేకుండా వెళ్లిపోయే విద్యార్థులను ఇప్పుడు తల్లిదండ్రులు తీసుకెళ్లాల్సి వచ్చింది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదివే ఇద్దరు పిల్లలు ఉంటే వారిని పాఠశాలల్లో వదిలి, తీసుకురావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తద్వారా డ్రాపౌట్స్ పెరగడంతో ప్రైవేటు పాఠశాలలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచుకున్నాయి.
- 3, 4, 5 తరగతులను తరలించడం వల్ల అనేకం సింగిల్ టీచర్ పాఠశాలలుగా మారిపోయాయి. అనారోగ్యం తదితర కారణాలతో ఉన్న ఒక్క టీచర్ సెలవు పెడితే ఇక ఆ పాఠశాల జరగని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదులు నిరుపయోగంగా మారిపోతే విలీనం కారణంగా వచ్చిన విద్యార్థులు ఉన్నత పాఠశాలల్లో తరగతి గదులు లేక ఇబ్బందులు పడ్డారు. పైగా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిలో తేడాలు రావడంతో పర్యవేక్షణ కొరవడింది.
- ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 98 కంటే తక్కువగా ఉంటే స్కూల్ అసిస్టెంట్ పోస్టు లేకుండా చేశారు. దీంతో ఎస్జీటీలతోనే బోధన సాగించాల్సిన పరిస్థితి. అయితే ఎస్జీటీలు 6, 7, 8 తరగతులకు ఆంగ్లం, గణితం, సైన్స్ బోధించలేక పోవడంతో విద్యార్థులు వెనుకబడిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలా 3వ తరగతి విద్యార్థులకు సబ్జెక్ట్ టీచర్లతో బోధన అంటూ ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్స్‌ను లేకుండా చేశారు.

ఉపాధ్యాయులకూ తప్పని సమస్యలు

జీవో కారణంగా ఉపాధ్యాయులకు పని భారం బాగా పెరిగింది. గతంలో ఉపాధ్యాయులకు వారానికి కనిష్ఠంగా 24 పిరియడ్లు, గరిష్ఠంగా 30 పిరియడ్లు ఉండేవి. జీవో తర్వాత ప్రతి ఉపాధ్యాయుడికీ 35 నుంచి 45 పిరియడ్లు వచ్చాయి. దీనివల్ల బోధనా నాణ్యత పడిపోయింది. రెమిడియల్ క్లాసులు నిర్వహించలేకపోవడంతో విద్యలో కాస్తంత బలహీనంగా ఉండే విద్యార్థులకు నష్టం వాటిల్లింది. అలాగే మూల్యాంకనం, సంసిద్ధతకు సమయం కొరవడింది. 30 లోపు విద్యార్థులకు ఒక సెకండరీ గ్రేడ్ టీచర్ చొప్పున కేటాయిస్తామన్నారుగాని 31కి పైగా ఉన్నచోట రెండో పోస్టు ఇవ్వలేదు. తరగతుల విలీనం వల్ల ఉపాధ్యాయులు తామున్న ప్రాంతాల నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు 3, 4, 5 తరగతుల విద్యార్థులకు వారి స్థాయికి దిగి బోధించలేకపోయారు. దీంతో విలీనమైన 3 నుంచి 5 తరగతుల విద్యార్థుల సామర్థ్యం తగ్గుముఖం పట్టింది.

ముక్కంటి ఆలయ ఈవోగా బాపిరెడ్డి బాధ్యతల స్వీకరణ



శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా బాపిరెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఈయన్ను ముక్కంటి ఆలయ ఈవోగా ఫారిన్ డిప్యుటేషన్ ప్రాతిపాదికన రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో ఆయన స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నాక, ఆలయ పరిపాలన భవనంలో బాధ్యతలను స్వీకరించారు. అనంతరం అధికారులు ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ప్రధాన అర్చకుడు కరుణాకర్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈవో బాపిరెడ్డి ఆలయంలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ప్రసాదాల కౌంటర్‌లో పరిస్థితిపై ఆరా తీశారు. భక్తులకు వేగవంతంగా ప్రసాదాలు సరఫరా చేసేలా సూచనలు చేశారు. అన్నదాన మండపంలో సాధారణ భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నాణ్యత లోపించకుండా ఎప్పటికపుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.

అసోం జైలు నుంచి పరారైన ఖైదీ అరెస్టు

- పోక్సో కేసులో ముద్దాయిగా పోలీసుల గుర్తింపు

తడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అసోం జైలు నుంచి పరారైన ఖైదీ జీయాలున్ ఇస్లాంను శనివారం అర్ధరాత్రి తడ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. అసోం రాష్ట్రం మారేగాన్ జిల్లాకు చెందిన మహ్మద్ జీయాలున్ ఓ అత్యాచారం కేసుకు సంబంధించి అక్కడి జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. జైలు అధికారుల కన్నుగప్పి అక్టోబరు 11వ తేదీ మరో ఖైదీతో కలిసి ఇతడు పరారయ్యాడు. అప్పటి నుంచి అక్కడి పోలీసులు ఈ ఖైదీల కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో జీయాలున్ ఇస్లాం తడ మండలం మాంబట్టు సెజ్‌లో తల దాచుకున్నట్లుగా అక్కడి పోలీసులకు సమాచారం అందింది. దీనిపై తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడికి ఆ జిల్లా ఎస్పీ హేమంత్‌కుమార్ సమాచారం అందించారు. ఆయన సూళ్లూరుపేట పోలీసులను అప్రమత్తం చేశారు. తడ మండలం మాంబట్టు సెజ్‌లోని ఓ ఇంట్లో ఇస్లాం ఉండగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మ నాయుడు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో అదుపులోకి తీసుకున్నారు. మాంబట్టులోని స్నేహితుడి వద్ద తల దాచుకున్నట్లుగా విచారణలో తేలింది. వెంటనే అసోం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారికి అప్పగించనున్నారు.



పోలీసుల అదుపులో ఉన్న జీయాలున్ ఇస్లాం

ఉమ్మడి జిల్లాకు 9000 సీసీ కెమెరాలు

- పోలీసు అధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి అనిత



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన పోలీసు వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర హోం మంత్రి అనిత తెలిపారు. ఈ క్రమంలో చిత్తూరు జిల్లాకు 3 వేలు, తిరుపతి జిల్లాకు 6 వేలు చొప్పున తొమ్మిది వేల సీసీ కెమెరాల సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి సబ్ డివిజన్‌కు ఒక డ్రోన్ అందజేస్తామన్నారు. ఇలా 25 సాధారణ, నైట్ విజన్ కెమెరాలున్న డ్రోన్లను అందించడానికి ఆలోచిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి నగరం శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథి గృహంలో ఆదివారం ఐజీ శ్రీధర్, డీఐజీ షిమోషి, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలు సుబ్బరాయుడు, మణికంఠ చందోలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలతో మంత్రి దాదాపు 3.30 గంటల పాటు సమావేశమయ్యారు. స్మార్ట్ పోలీసు వ్యవస్థ రూపకల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎక్కడా గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్ జరగకుండా చూడడానికి అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. చిన్నారులపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడే వారికి అదే రోజు ఆఖరి రోజు కావాలన్నారు. సోషల్ మీడియాలో అశ్లీల చిత్రాల కట్టడికి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. సైబర్ క్రైం పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. నేరాల కట్టడి, స్మగ్లింగ్‌ను అరికట్టడం, పోలీసు వ్యవస్థ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు తీసుకున్నారు. జిల్లాలో ప్రొటోకాల్, శాంతి భద్రతలు, నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలపై ఎస్పీ సుబ్బరాయుడును మంత్రి అనిత ప్రశంసించారు. తప్పు చేసిన అధికారుల పట్ల కఠినంగా ఉండారనడానికి నాలుగు నెలల్లో తీసుకున్న చర్యలే నిదర్శనమని ఆమె ప్రస్తావించారు. అనంతరం మంత్రి తిరుమలకు బయలుదేరి వెళ్లారు. సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

గంజాయి, మద్యం మత్తులో బరితెగింపు

- అయిన వారితోనే పొంచి ఉన్న ముప్పు
- హోం మంత్రి అనిత ఆవేదన



మీడియాతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

పుత్తూరు అర్బన్/వడమాలపేట/రేణిగుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం, గంజాయి మత్తులో మానవ మృగాలు బరితెగిస్తున్నారంటూ హోం మంత్రి అనిత అన్నారు. అయిన వారి నుంచే మహిళలకు, చిన్నారులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారి నుంచి ఎలా రక్షించుకోవాలో తెలియడం లేదని ఆందోళన చెందారు. వడమాలపేట మండలంలో చిన్నారి హత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. ఆమె తల్లిదండ్రులను ఆదివారం మంత్రి పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.పది లక్షల చెక్కు అందజేశారు. నిందితుడికి కఠినంగా శిక్ష పడేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. చిత్రపటంలో ఆ చిన్నారి చిరునవ్వును చూసి నివాళులర్పిస్తున్న సమయంలో మనస్సులో క్షమించమని కోరానన్నారు. బాధ్యతాయుతమైన పోస్టులో ఉన్న నాకు ఇటువంటి సంఘటన బాధించిందన్నారు. ఈ కేసును స్పెషల్ కోర్టుకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో జరిగిన అఘాయిత్యాలలో నిందితుల్ని 24 గంటల్లో అదుపులోకి తీసుకుని శిక్షలు పడేలా చర్యలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వంలో అనేక హత్యాచారాలు జరిగినా రాని వారందరూ.. నేడు వచ్చి రాజకీయ లబ్ధి కోసం పాకులాడడం సరికాదని హితవు పలికారు. ఇలాంటి ఘటనలపై రాజకీయాలు మాట్లాడటం పట్ల దేవుడు క్షమించరన్నారు. గత ఐదేళ్లలో పోలీసు వ్యవస్థను వైసీపీ నిర్వీర్యం చేసిందన్నారు. క్రైం రికార్డు చూస్తే గత ఐదేళ్లలో ఎన్నో ఘటనలు జరిగాయన్నారు. తమ ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడుతోదన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపామని, నార్కోటిక్ వింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బెల్టు షాపుల విషయంలో సీఎం చంద్రబాబు చాలా సీరియస్‌గా ఉన్నారన్నారు. మంత్రితో పాటు చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీనివాసులు, ఆర్డీవో రామ్మోహన్, టీడీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, నేతలు చినబాబు, అరుణ, ధనంజయులు నాయుడు, లక్ష్మీప్రసన్న, లోకరాజు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రేణిగుంట విమానాశ్రయంలోనూ హోం మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు.



ఆ మానవ మృగాన్ని ఉరి తీయాలి

- ఎస్వీయూలో గళమెత్తిన విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల చిన్నారిని హత్యాచారం చేసిన సుశాంత్‌ను ఉరి తీయాలని ఎస్వీయూని వర్సిటీలో విద్యార్థినులు గళమెత్తారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఉమెన్ హాస్టల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహిళలపై సాగుతున్న ఈ తరహా హింసపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఏఐఎస్ఎఫ్ నేత చిన్నా కోరారు. ఎక్స్‌గ్రేషియాతో సరిపెట్టుకోకుండా, నిందితులకు కఠిన శిక్ష వేయడం ద్వారా భవిష్యత్తులో అత్యాచారాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాయకులు చంద్రానాయక్, శ్రావణి, వనిత, మౌనిక, వాణిశ్రీ, ఇక్బాల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కరకంబాడి రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు



కరకంబాడి రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్, బారులు తీరిన వాహనాలు

తిరుపతి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరకంబాడిరోడ్డు, శ్రీనివాససేతు ర్యాంపుకు ముందుగా ప్రజలు ప్రతినిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఏడాది క్రితం సైడుకాలువ నిర్మాణం కోసం తవ్వేసి వదిలేయడం, దాంతో వెడల్పు తగ్గి రోడ్డు ఇరుకుగా మారిపోవడం, సుబ్బారెడ్డినగర్‌కు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో వాహనాలు అడ్డదిడ్డంగా నడుస్తున్నాయి. దీంతో తరచూ ట్రాఫిక్ స్తంభించి వాహనాలు బారులు తీరుతున్నాయి. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో సమస్య మరింత అధికంగా ఉంటోంది. విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. అంబులెన్స్‌లు కూడా ట్రాఫిక్‌లో ఇరుక్కుంటున్నాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు కూడా అందుబాటులో లేకపోవడం కూడా సమస్యకు మరో కారణంగా తెలుస్తోంది. ప్రజల సౌకర్యార్థం అక్కడ ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటుచేయాలని, తవ్వేసి వదిలేసిన పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

జమిలి ఎన్నికలతో అధికారం మనదే

● ఉమ్మడి జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా భూమన ప్రమాణ స్వీకారం



తిరుపతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు 2027లో వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని, కూటమి ప్రభుత్వ వ్యతిరేకతే మనల్ని అధికారంలోకి తీసుకొస్తుందని వైసీపీ ముఖ్యనేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలో ఆదివారం చంద్రగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. భూమన సారథ్యంలో పార్టీ బలపడాలని వైసీపీ సీనియర్ నేతలు వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణా రెడ్డి, అంబటి రాంబాబు, రోజా తదితరులు ఆకాంక్షించారు. కార్యకర్తల సంక్షేమం, పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని నూతన అధ్యక్షుడు చెప్పారు. అందరి సూచనలతో ముందుకు వెళతామని చెప్పారు. జిల్లాలో వైసీపీ నాయకుల గ్రూపు రాజకీయాలపై మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అసంతృప్తి వ్యక్తంచేస్తూ, ఇప్పటికైనా ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరారు. చంద్రగిరిలో మోహిత్‌ను ఓడించడానికి 25 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు శ్రమించారన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రమాణోత్సవానికి హాజరుకాకపోవడంపై చర్చ జరిగింది. ఆయన కుటుంబ సభ్యుల వివాహ నిశ్చితార్థ కార్యక్రమానికి వెళ్లడంతో రాలేకపోయారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన పంపిన సందేశాన్ని కరుణాకరరెడ్డి చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ భరత్, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, మేయర్ శిరీష, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండుగలా ఆకాశదీపం



ఆకాశదీప పూజల్లో ఈవో తదితరులు - ఆకాశ దీపాన్ని ఎగురవేస్తున్న ఈవో తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాశదీపం కన్నుల పండువగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజూ ఆకాశదీపాన్ని వెలిగించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఎగురవేశారు. భక్తులు ఆకాశ దీపాన్ని దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిపారవశ్యంలో ముంచెత్తిన శివకీర్తనలు



గీతాలు ఆలపిస్తున్న మహిళలు

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని బ్రహ్మగుడి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నెల్లూరుకు చెందిన సురభి మహాలక్ష్మి సత్సంగ బృందం ఆలపించిన శివకీర్తనలు భక్తులను అలరించాయి. లయబద్ధంగా పాడి భక్తిలహరిలో ముంచారు. ఆలయ అధికారులు వారికి జ్ఞాపికలు అందజేశారు.

రైల్వేలో చేనేత వస్త్రాలకు ప్రాధాన్యం కల్పించండి

వరదయ్యపాళెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖలో చేనేత వస్త్రాలను వినియోగించేలా ప్రాధాన్యం కల్పిస్తూ ప్రోత్సహించాలని జాతీయ చేనేత ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడు గుత్తి త్యాగరాజు అనకాపల్లి ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ సీఎం రమేష్‌కు విన్నవించారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రమేష్‌కు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్‌ను త్యాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. రమేష్‌కు చేనేత రాట్నాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖ మంత్రికి సాదర వీడ్కోలు



మంత్రి మనోహర్‌తో ఎమ్మెల్యే పులివర్తి నాని, జనసేన నేత పసుపులేటి హరిప్రసాద్

రేణిగుంట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్‌కు జనసేన నాయకులు సాదర వీడ్కోలు పలికారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు పయనం కాగా ఆయనకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి కోట వినుత, సాదర వీడ్కోలు పలికారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

కేవీబీపురం, నవంబరు 3(ఆంధ్ర జ్యోతి): మండలంలోని రాజుల కండ్రిగకు చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాసులు నాయుడు(78) శనివారం అర్ధరాత్రి ఆకస్మికంగా మరణించారు. ఆయన ప్రస్తుత మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజులు నాయుడికి సోదరుడు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు, తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, పిచ్చాటూరు మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, దుష్యంత్‌రాజు తదితరులు రాజుల కండ్రిగకు చేరుకుని శ్రీనివాసులు నాయుడు భౌతికకాయానికి నివాళులర్పించారు.

హోం మంత్రితో మాజీ మంత్రి భేటీ

వడమాలపేట, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపం పురంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనితను మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బాధిత కుటుంబానికి సాయం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రద్ధ చూపడం సంతోషకరమని చెప్పారు.

నత్తనడకన రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు

●ఏడేళ్లుగా కొనసా....గుతున్న వైనం ●20శాతం పనుల పూర్తిలో కాలయాపన



అసంపూర్తిగా ప్లాట్‌ఫారం నిర్మాణ పనులు

తిరుపతి (సెంట్రల్)నవంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రైల్వే స్టేషన్ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. తిరుమల పుణ్యక్షేత్రం దర్శనానికి నానాటికీ రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ఇక్కడ స్టేషన్‌ను ప్రతిపాదించారు. భక్తుల్లో రైళ్లలో వచ్చే ప్రయాణికుల సంఖ్యే ఎక్కువగా ఉంటుంది. రైళ్ల తాకిడిని దృష్టిలో పెట్టుకుని తిరుపతి స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించాలని నాటి టీటీడీ మాజీ ఛైర్మెన్ చదలవాడ క్రిష్ణమూర్తి రైల్వే బోర్డు అధికారులతో చర్చించారు. సీఆర్‌ఎస్ వద్ద తిరుచానూరు రైల్వే స్టేషన్(పద్మావతి రైల్వే స్టేషన్) నిర్మించాలని కోరారు. ఇందుకు రైల్వే అధికారులు అంగీకరించారు. 2016-17లో స్టేషన్ నిర్మించడానికి రైల్వే బోర్డు రూ.32 కోట్లు దశలవారీగా మంజూరు చేసింది. మూడేళ్ళ క్రితమే కొత్త స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని జీఎం స్థాయి అధికారులు తెలిపారు. అయితే నేటి వరకు పనులు పూర్తికాలేదు.



ప్లాట్‌ఫారంపైకి పాకిన ముళ్ళ చెట్లు

నిధులు విడుదలలో జాప్యం వల్ల కూడా పనులు మందగించాయనే వాదన ఉంది. ఏడాది క్రితం 80 శాతం పనులు పూర్తయ్యాయి. రైళ్ళ రాక పోకలు,స్టేషన్ నిర్వహణకు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. రోజు వారీగా రైళ్ళ రాకపోకలు జరుగుతున్నాయి. మిగిలిన 20 శాతం పనులను పూర్తి చేయడానికి కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రేకుషెడ్ల నిర్మాణపనులు కూడా నత్త నడకన సాగుతున్నాయి. ప్లాట్‌ఫారాల మరమ్మతులు గాలికి వదిలేశారు. ఎస్‌ఎంఆర్ భవనం తూర్పుగా రేకుషెడ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయి. రేకు షెడ్ల రూఫింగ్ పనులు పూర్తి చేయాల్సివుంది. ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించకుండానే అధికారులు తాత్కాలిక అవసరాలకు రైల్వే స్టేషన్‌ను వినియోగిస్తున్నారు. పెండింగ్ నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో స్టేషన్ పూర్తి స్థాయిలో ఎప్పుడు అందుబాటులోకి వస్తుందా అని ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన వివిధ విభాగాల అధికారులు మాత్రం ఈ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్నారు. కానీ నిర్మాణాలు ఎప్పటికి పూర్తి చేస్తారో మాత్రం చెప్పలేకపోతున్నారు. రికార్డుల్లో స్టేషన్ నిర్మాణాలు పూర్తయినట్లు పేర్కొన్నారని సమాచారం.

తడుకు దారిలో వెళ్లాలంటే వణుకే



రామచంద్రాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాదూరు, పరమాలమీదుగా వెళ్లే తడుకు ఆర్ అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారై పాదచారులకు,వాహనచోదకులకు పరీక్ష పెడుతోంది. గత వైసీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు రోడ్డు మరమ్మతులకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. ఫలితంగా నిర్వహణ కొరవడింది. బాదూరు నుంచి తడుకు వరకు 13కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలమయంగా తయారైంది. వర్షం పడితే చాలు. ఈ గుంతల్లో నీరు చేరుతోంది. నీటితో నిండిన గుంతల లోతు తెలియక పలువురు వాహనచోదకులు అదుపుతప్పి గాయాల పాలవుతున్నారు. గుంతలమయమైన ఈ రోడ్డుకు గ్రామస్థులు అడపాదడపా కంకరపోసి పూడ్చుతున్నారు. ఇది తాత్కాలికమే అవుతోంది. కొద్ది రోజులు కాగానే మళ్లీ కష్టాలు మామూలే. బాదూరు మలుపు వద్ద పెదగుంత ఏర్పడింది. ఇందులో మట్టిపోసి వదిలేశారు. ఇటీవల ఓ పాఠశాల ఉపాధ్యాయురాలు స్కూటీపై వెళుతూ అదుపు తప్పి పడిపోయి గాయాల పాలయ్యారు. తక్షణమే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరముందని ప్రజలు కోరుతున్నారు.

బిర్యానీలో బొద్దింకతో అవాక్కయిన వినియోగదారుడు





● సోషల్ మీడియాలో పోస్టులు

తిరుపతి ఉపాధ్యాయనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శెట్టిపల్లికి చెందిన ఓ వినియోగదారుడు ఆదివారం కావడంతో స్విగ్గీ యాప్ ద్వారా బస్టాండ్ సమీపంలోని ఒక హోటల్ నుంచి రూ.1,255ల విలువైన బకెట్ బిర్యానీ ఆర్డర్ చేశారు. బిర్యానీ ఓపెన్ చేసి చూడగా అందులో బొద్దింక కనిపించడంతో ఒక్కసారిగా అవాక్కయ్యాడు. ఫొటోలు, వీడియోలు తీసి, సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

తనిఖీలు నాస్తి... కల్తీలు జాస్తి

తిరుపతిలో ఇలాంటి ఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోయాయి. రోజూ లక్షలాదిమంది యాత్రికులు వచ్చివెళ్లే నగరంలోని హోటళ్లలో నిరంతరం తనిఖీలు నిర్వహించాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇలాంటి ఘటనలు వెలుగు చూసినప్పుడు మాత్రమే తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించి, ఊరకుండిపోతున్నారు. ఫిర్యాదులు వచ్చిన హోటళ్ల నుంచి ఆమ్యామ్యాలు వసూలు చేసి, నామమాత్రపు చర్యలతో సరిపుచ్చుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల తిరుపతిలో ఓ పేరెన్నికగన్న హోటల్లోని ఆహార పదార్థాల్లో జెర్రి కనిపించడం వివాదాస్పదమైంది. తనిఖీలు చేయగా పాచిపోయిన ఆహార పదార్థాలు వెలుగుచూశాయి. దీంతో హోటల్‌ను సీజ్ చేశారు. హోటల్‌పై చర్యలు తీసుకోరాదంటూ పొరుగు రాష్ట్ర మంత్రి స్థాయి వ్యక్తులు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. రాజకీయ ఒత్తిడులు కూడా తనిఖీలకు అడ్డంకిగా మారుతున్నాయి.

తిరుపతిలో పూర్వ విద్యార్థుల జ్ఞాపకాల కలబోత



తిరుపతిలో కలుసుకున్న కేకేవీపురం హైస్కూలు పూర్వ విద్యార్థులు(1985 టెన్త్ బ్యాచ్)

తిరుపతి(విద్య), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వారంతా సుమారు నాలుగు దశాబ్దాల క్రితం చదువుకున్నారు. 1985లో రామచంద్రపురం మండలం కేకేవీపురం హైస్కూలులో పదో తరగతి అభ్యసించారు. ఇప్పుడు వీరంతా కలుసుకోవాలని సంకల్పించారు. వీరి కలయికకు తిరుపతిలో పాయ్‌వైస్రాయ్ హోటల్ ఆదివారం వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులందరూ పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు. తాము చదువుకున్న రోజులకు సంబంధించిన ముచ్చట్లను నెమరువేసుకున్నారు. చాన్నాళ్ల తర్వాత కలుసుకున్న వీరంతా చాలా ఆనందంగా ఆ క్షణాలను ఆస్వాదించారు. ఇలా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు చెప్పారు. సమావేశాన్ని పూర్వ విద్యార్థులు దొరైరాజ్,శాంతలక్ష్మి నిర్వహించారు.

●ఏర్పేడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2013-14లో టెన్త్ చదివిన విద్యార్థులు అపూర్వ కలయిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అదే విధంగా ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-99 పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది.

తెలంగాణ సీఎంతో బొజ్జల సుధీర్ భేటీ



శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదివారం భేటీ అయ్యారు. శ్రీకాళహస్తిలో తెలంగాణ భవన్ ఏర్పాటుపై చర్చించారు. ఈ భేటీలో కాంగ్రెస్ సీనియర్ నేత ఝాన్సీ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇటీవల పలు రాష్ట్రాల అతిథి గృహాలను శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేస్తామని చెప్పిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తెలంగాణ సీఎం తెలంగాణ అతిథిగృహ నిర్మాణానికి అంగీకరించారని ఇందుకోసం ఆలయ పరిసరాల్లో అర ఎకరా కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ సీఎంని కలిసి చర్చించడం శుభపరిణామమని పట్టణ ప్రజలు అంటున్నారు.

ఎన్టీఆర్ నగర్‌లో కార్డన్ సెర్చ్



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో కార్డన్ సెర్చిని ఎస్ఐ విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించిన వాహనాలను, రికార్డులు లేని వాహనాలను, ప్రమాదానికి కారణమైన వాహనాలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా వాహనదారుడిని అదుపులోకి తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని పలు ద్విచక్రవాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. పత్రాలు చూపించి వాహనాలు తీసుకుపోవాలని తెలిపారు.

ట్యాక్స్ చెల్లింపు తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు ట్యాక్స్‌తో పాటుగా ఇతర ట్యాక్స్‌లను చెల్లించాలని శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర నాయుడు చెప్పారు. బుచ్చినాయుడు కండ్రిగ పోలీసుస్టేషన్ సమీపంలో ఆదివారం వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ట్యాక్సు చెల్లించాలని లేకపోతే రెండు వందల శాతం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ఆటోలను నడపకూడదన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

రేపు నాగుల చవితి వేడుకలు

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో మంగళవారం నాగుల చవితి వేడుకలను నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6గంటలకు తిరుమంజనం గోపురం సమీపంలోని నాగులపుట్ట వద్ద ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మదనపల్లెలో రోడ్ల విస్తరణకు శ్రీకారం

● నేలకొరుగుతున్న వందేళ్ల చింతవృక్షాలు ● పదిహేనేళ్ల తర్వాత మళ్లీ తెరపైకి విస్తరణ

● ఆక్రమణలు తొలగేనా..ట్రాఫిక్ తీరేనా..?



సీటీఎం రోడ్డులో చింతచెట్లను తొలగిస్తున్న కార్మికులు

మదనపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలోని సీటీఎం రోడ్డులో గల వందేళ్ల చింతవృక్షాలు నేలకొరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ పేరు తో వీటిని తొలగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, దీనికి పరిష్కారానికి రోడ్డు వెడల్పు చేయడమే మార్గమని స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా చెబుతున్నారు. ఇందులో భాగంగా ఎక్కడ సభలు, సమావేశాల్లో పాల్గొన్నా..ట్రాఫిక్ సమస్యను ప్రస్తావిస్తూ, సమస్య పరిష్కారానికి సహకరించాలని అటు ప్రజలు, ఇటు వాహనదారులను కోరుతున్నారు. ఇందులో భాగంగా రెండురోజుల క్రితం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ట్రాఫిక్ సమస్యను వివరిస్తూ, ఎక్కడెక్కడ సమస్య ఉందో పట్టణంలో కలెక్టర్‌తో కలసి పట్టణంలో పర్యటించారు. ఇందులో భాగంగా కదిరి రోడ్డు, బెంగళూరు బస్టాండు, సీటీఎం రోడ్డు, గాంధీరోడ్డు ఏరియాలలో పర్యటించి పట్టణవాసులకు ఎదురువుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే ఏకరువు పెట్టారు. దీనికి పరిష్కారంలో భాగంగా రోడ్ల విస్తరణే శరణ్యమని భావించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, అటవీ, రోడ్లు, భవనాల శాఖ, విద్యుత్తు శాఖ అధికారులతో సంప్రదించినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం మొదట సీటీఎం రోడ్డులో రోడ్డు పక్కనున్న చింతచెట్లను తొలగిస్తున్నారు. కార్మికులు యంత్రాలు, మిషన్లతో కొమ్మలను తొలగించగా, భారీ క్రేన్‌తో వాటిని పక్కన పడేసే పనులు చేపట్టారు. ఇందుకోసం పాత ఎమర్జెన్సీ హాస్పిటల్ వద్ద, ఇటు బర్మా వీధిక్రాస్‌లో ట్రాఫిక్‌ను మళ్లించారు. సోమవారం ఉదయం కూడా పెద్దమొత్తంలో వర్కర్లను పెట్టి చెట్లను తొలగించనున్నట్లు చెబుతున్నారు. నిజంగా సీటీఎం రోడ్డులో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలంటే చింతవృక్షాలను మధ్యలో వదిలేసి రోడ్డుకు అటు, ఇటు ఉన్న ఆక్రమణలు తొలగిస్తే సరిపోతుంది. అలా కాకుండా ఆఫీసర్స్ క్లబ్ నుంచి చిత్తూరు బస్టాండు సర్కిల్ వరకూ ఉన్న 27-30 భారీ చింతవృక్షాలను తొలగించాల్సి వస్తోంది. పదిహేనేళ్ల క్రితం కూడా రోడ్డు విస్తరణ చేయాలని అప్పటి పాలకులు భావించినా..స్థానికుల అభ్యంతరాలు, కొందరు న్యాయస్థానానికి వెళ్లడంతో విస్తరణకు బ్రేక్ పడింది. రోడ్డు పక్కనున్న ఆక్రమణలను తొలగిస్తే తమకు అభ్యంతరం లేదని, పర్యావరణంతో పాటు పట్టణవాసులకు నీడనిస్తున్న చింతవృక్షాలను తొలగించడంపైనే స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా యూనియన్ బ్యాంక్ విజిలెన్స్ వారోత్సవాలు



మారథాన్‌లో పాల్గొన్న బ్యాంకు అధికారులు, సిబ్బంది

తిరుపతి గాంధీరోడ్డు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఇందులోభాగంగా బాలాజీ కాలనీ బ్రాంచి కూడలి నుంచి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని ఆర్టీఓ కార్యాలయం సమీపంలోని మెయిన్ బ్రాంచ్ వరకు మారథాన్ నిర్వహించారు. ప్రాంతీయ కార్యాలయంలో అధికారులు మొక్కలు నాటారు. విజిలెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి ప్రాంతీయ విజిలెన్స్ ప్రధాన అధికారి కొర్లం గిరిధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమాల్లో ప్రాంతీయ కార్యాలయ అధికారి గాలి రాంప్రసాద్, గోపాలకృష్ణ, ప్రాంతీయ ఉప అధికారులు బహ్మయ్య, అభిమన్యు, సుబ్బారావు, లోన్ల రికవరీ ప్రధాన అధికారి, ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్ ఫెడరేషన్ జాయింట్ జనరల్ సెక్రటరీ, ఏఐబీఓసీ రాష్ట్ర చైర్మన్ బంగారంగారు శేషసాయి, డాక్టర్ కామిశెట్టి రామచంద్ర, లోన్ల రికవరీ మాజీ అధికారి గుంటూరు రవికుమార్, వివిధ బ్రాంచ్‌ల ప్రధాన మేనేజర్లు, సహోద్యోగులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గణపతి హోమం



గణపతిహోమం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

తిరుపతి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గణపతిహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో వినాయకస్వామి ప్రతిమకు విశేష అలంకరణ చేపట్టారు. పూజ, జపం, గణపతి హోమం, లఘు పూర్ణాహుతి, నివేదన కావించి, నెయ్యి, అన్నం, అటుకులు, బెల్లం, అరటిపండ్లు తదితర ద్రవ్యాలతో హోమం చేపట్టారు. 16నామాలతో గణపతిని స్తుతించారు. సాయంత్రం హోమం, గణపతి సహస్రనామార్చన, నివేదన, విశేష దీపారాధన, మంత్రపుష్పం, హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, అర్చకస్వాములు పాల్గొన్నారు.

తిరుపతి

ఆనందరావుకు ఘన నివాళి

తిరుపతి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల కళాకారుడు కొత్తపల్లి ఆనందరావు జయంతిని పురస్కరించుకుని ఆదివారం పలువురు నివాళి అర్పించారు. కపిలతీర్థం రోడ్డులోని కొత్తపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి జిల్లాలోని కళాకారులు హాజరై పుష్పాంజలి ఘటించారు. మహిళా కళాకారులను సత్కరించారు. కళాకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మునిరత్నం, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథరెడ్డి, కె.ఎస్.రాజ, జయచంద్ర, రజిని, యశోద, శైలజ, అమరావతి, కల్పన, ఉష, జయమ్మ, సిద్ధారెడ్డి, విజయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, పొన్నాల జేజిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన ఇబ్రాయిల్

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం తిరుపతి రూరల్ మండలం ఓటేరు వద్ద చోటుచేసుకుంది. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... ప్రకాశం జిల్లా మర్రిపూడికి చెందిన ఇబ్రాయల్ తిరుపతికి వచ్చి మేస్త్రీ పని చేసుకుని జీవిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి ఓటేరు వద్ద హైవేపై నడుచుకుంటూ వస్తుండగా హైవే పైనుంచి ఓటేరు వైపు వెళుతున్న బుల్లెట్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



పూర్తిగా లోపించిన పారిశుధ్యం - అసంపూర్తిగా ఉన్న పెద్ద కాలువ నిర్మాణం

సమస్యల వలయంలో భూపాల్ హౌసింగ్ కాలనీ

అసంపూర్తిగా వరద కాలువ నిర్మాణం - రోడ్ల పరిస్థితి అంతంతమాత్రమే



కాలనీలో మట్టి రోడ్లు

తిరుపతి (జీవకోన), నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): 50వ డివిజన్ పరిధిలోని భూపాల్ హౌసింగ్ కాలనీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. 22 ఏళ్ల క్రితం ఏర్పడిన ఈ కాలనీలో 373 కుటుంబాలు నివాసముంటున్నాయి. బయట నుంచి చూస్తే అందంగా కనిపించే ఈ కాలనీ లోపలికి వెళితే సమస్యలు స్వాగతం పలుకుతాయి. పూర్తిస్థాయిలో రోడ్లు, కాలువలు లేవు. అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉండడంతో చిన్నపాటి వర్షం వచ్చినా కొండ నీరు కాలనీలోకి చేరుతోంది. తద్వారా ఇళ్లలోకి నీరు ప్రవేశిస్తోంది. ఈ సమస్యను స్థానికులు 2018లో అప్పటి టీడీపీ పాలకుల దృష్టికి తీసుకెళ్లగా వరద నీరు వెళ్లేలా పెద్ద కాలువ(ట్రంచ్) నిర్మాణం కోసం రూ.48.5లక్షలను మంజూరు చేయించారు. అయితే ఎన్నికలు రావడంతో పనులు మొదలుకాలేదు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో కాలువ నిర్మాణం చేపట్టినా కాలనీలో ఎక్కువ శాతం మంది టీడీపీ సానుభూతిపరులనే విషయం తెలుసుకుని అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సైతం కాలనీలో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా కాలనీలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు వేసి, మిగతా వాటి గురించి పట్టించుకోలేదు. రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పారిశుధ్యం పూర్తిగా లోపించింది. రోడ్లపైనే చెత్తాచెదారం పేరుకుపోయింది. వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులకు వెచ్చించలేదు. వేసిన ఒక బోరు కూడా పనిచేయడం లేదు. ఇకనైనా అధికారులు, పాలకులు కాలనీ సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



సుబ్బారెడ్డి నగర్‌లో గుంతలమయంగా ఉన్న రోడ్డు - వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు

సుబ్బారెడ్డినగర్‌లో అధ్వానంగా రోడ్లు

తిరుపతి (జీవకోన), నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఒకటో డివిజన్ పరిధిలోని సుబ్బారెడ్డినగర్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కాలనీలో కొన్ని రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. పలుచోట్ల గుంతలమయంగా తయారయ్యాయి. చిన్నపాటి వర్షం పడినా రోడ్లపై నీరు నిలబడుతోంది. గుంతలను గుర్తించలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీల హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న నాగరాజగౌడ్

తిరుపతి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, వారి అభ్యున్నతికి తోడ్పాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక పెద్దకాపు లేఅవుట్‌లోని బీసీ సంక్షేమ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి గెలుపునకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. సత్వరమే 34 శాతం రిజర్వేషన్ అమలుచేసి, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొచ్చి సమగ్రంగా అమలు చేయాలని కోరారు. అన్ని జిల్లాల్లో బీసీ భవనాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో బీసీ నేత వసంతకుమార్ పాల్గొన్నారు.

సీబీఎస్‌లో ప్రయాణికుల రద్దీ



రిజర్వేషన్ కౌంటర్ వద్ద బారులుతీరిన ప్రయాణికులు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా సొంతూళ్లకు వచ్చిన ప్రజలు ఆదివారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో సెంట్రల్ బస్టాండులో రద్దీ కనిపించింది. హైదరాబాదు, చెన్నై, బెంగళూరు, విజయవాడ స్టాపింగ్‌లలో ప్రయాణికుల సందడి కనిపించింది. టికెట్ రిజర్వేషన్ కోసం కౌంటర్ల వద్ద బారులు తీరారు. తిరుమల నుంచి తిరిగి వచ్చే భక్తులూ పెద్ద సంఖ్యలో కనిపించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రధాన నగరాలకు అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక ఆర్టీసీ బస్సులు కూడా ప్రయాణికులతో కిక్కిరిశాయి.

హిందూ ఆలయాలను విముక్తం చేయాలి



మాట్లాడుతున్న ముఖ్య వక్త శ్రీనివాసరెడ్డి, పాల్గొన్న ప్రముఖులు

తిరుపతి విద్య, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహకార్యవాహ మాలపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇదే నినాదంతో 2025 జనవరి 5వ తేదీన విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభ సన్నాహక కార్యక్రమం తిరుపతిలోని ఓ పాఠశాలలో ఆదివారం జరిగింది. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థలు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వచ్చిన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి తప్పించి స్వయం ప్రతిపత్తి కలిగిన ఓ ధార్మిక వ్యవస్థకు అప్పగించాల్సిన అవసరముందన్నారు. ఇందుకుగాను వెంటనే చట్టసవరణ చేయాలన్నారు. ఇదే డిమాండ్‌తో వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన హైందవ శంఖారావం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభను జయప్రదం చేసేందుకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘ చాలక్ ఆనంద రెడ్డి, విశ్వహిందూ పరిషత్ ప్రాంత సభ్యులు నందిరెడ్డి సాయి రెడ్డి, విశ్వహిందూ పరిషత్ మహిళా ప్రముఖ్ మురాలమ్మ, జిల్లా కార్యవాహ ఈశ్వరయ్య, విశ్వహిందూ పరిషత్ విభాగ్ ప్రముఖ్ భరణికృష్ణ, ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థల 16 క్షేత్రాలు పాల్గొన్నాయి.

మురుగు నీటిలో తెలుగుగంగ పైపులు



తెలుగుగంగ పైపులకు మరమ్మతులు

తిరుపతి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంగళం-శెట్టిపల్లె ప్రధాన రహదారికి ఇరువైపులా తెలుగుగంగ పైపులు ఏర్పాటు చేశారు. దారి పొడవునా నాలుగు మురుగు కాలువలు ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు నీటి ఉధృతికి తెలుగుగంగ పైపులు పగిలిపోయి మురుగునీరు ప్రవేశిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టుకు అనుకుని ఉన్న తెలుగుగంగ పైపు పగిలి రంగుమారిన నీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి శని, ఆదివారాల్లో పైపులకు మరమ్మతులు చేశారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో జీఎం తనిఖీలు



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

తిరుపతి(సెంట్రల్) నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆదివారం సాయంత్రం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు అరుణ్ కుమార్ జైన్ తనిఖీలు చేశారు. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనాలు, ఎయిర్‌కాన్ కోర్సులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని సూచించారు. స్టేషన్‌లో పారిశుధ్యం పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గుంతకల్లు డివిజన్ మేనేజరు విజయకుమార్, నిర్మాణాల విభాగం సీఈ సూర్యనారాయణ, తిరుపతి డిప్యూటీ సీఈ ఉపేంద్రకుమార్, రైల్వే భద్రతా దళాల ఏఎస్‌ఈ రాజగోపాల్ రెడ్డి, స్టేషన్ మేనేజరు డాక్టర్ కె.చిన్నప్పరెడ్డి, అధికారులు ప్రభాకర్, మాధవరావు, ఐపీఎఫ్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రమేష్, లక్ష్మణ్‌లకు స్వాగతం



తిరుపతి విద్య, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ సీఎం రమేష్, ఓబీసీ మోర్చా జాతీయ నాయకుడు కె.లక్ష్మణ్‌లకు ఆదివారం స్థానిక బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. తాజ్ హోటల్లో పార్టీ నాయకులు జల్లి మధుసూదన్, కోలా ఆనంద్ తదితరులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలియజేశారు. ఇటీవల పార్టీలో చేరిన బీజేపీ నాయకుడు గవ్వల అశోక్ వారిరువురిని దుశ్శాలువలతో సత్కరించారు.

సీఎం రమేష్‌కు ఘన స్వాగతం



సీఎం రమేష్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు ఆర్సీ మునికృష్ణ, పాకం వెంకటేష్

తిరుపతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి పర్యటనకు వచ్చిన రైల్వే స్టాండింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సీఎం రమేష్‌కు స్థానిక టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం తాజ్ హోటల్ వద్ద సీఎం రమేష్‌కు శాలువా కప్పి, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాకం వెంకటేష్, కరాటే చంద్ర, సుబ్బు యాదవ్, దేవాచారి, సుబ్రమణ్యం, రవితేజ, కోదండరామయ్య, నరేష్ చౌదరి, ప్రసాద్, సుబ్బరాయుడు, చంద్ర, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తిరుపతి(వైద్యం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీపీపీఎం హైస్కూల్లో 1995-96వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు 28 ఏళ్ల తర్వాత ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి విద్యార్థులందరూ కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. మృతిచెందిన విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. అనంతరం విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అప్పటి ఉపాధ్యాయులు మునిరామయ్య, వెంకటేశ్వర్లు, పర్వత రెడ్డి, శ్రీదేవి, ప్రస్తుత హెచ్‌ఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ నాయుడికి మమత అభినందనలు



బీఆర్ నాయుడికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న మమత

తిరుపతిరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన టీడీపీ మహిళా నేత, మాజీ సర్పంచ్ మమత టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడిని ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామి అంటే అచంచలమైన భక్తి విశ్వాసాలు కలిగిన బి.ఆర్.నాయుడు టీటీడీ పాలకమండలి అధ్యక్షుడిగా నియమితులు కావడం సంతోషదాయకమన్నారు.


స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌కు స్వాగతం



ఛైర్మన్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేత గోపినాథరెడ్డి

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ సీఎం రమేష్‌కు బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ గుండాల గోపినాథరెడ్డి స్వాగతం పలికారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సభ్యుడు ఎంపీ లక్ష్మణ్‌ను సన్మానించారు. స్వాగతం పలికిన వారిలో సుబ్రమణ్యం యాదవ్, కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్, జల్లి మధుసూదన్, అజయ్‌కుమార్, పి.మురళి, ఎం.రవిప్రసాద్, టి.సుబ్రమణ్యం రెడ్డి ఉన్నారు.

తిరుపతి చిత్రకారుడికి ప్రథమ బహుమతి




ముక్తేశ్వర్ ఆలయ చిత్రం వేసిన చిత్రకారుడు చిరంజీవిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలులో ఆదివారం జరిగిన ఆర్ట్ ఫెస్ట్‌లో తిరుపతి చిత్రకారుడు చిరంజీవికి ప్రథమ బహుమతి దక్కింది. పెయింటింగ్‌లో జాతీయ స్థాయి అవార్డులు, ప్రపంచ రికార్డులు సాధించిన రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వంద మంది ప్రముఖ ఆర్టిస్టులు ఆర్ట్ ఫెస్ట్‌లో పాల్గొన్నట్టు నిర్వాహకుడు శేషబ్రహ్మం తెలిపారు. 'ప్రాచీన భారత్' అంశం మీద చిత్రకారులు కాన్వాస్ పెయింటింగ్స్ ప్రదర్శన చేశారు. అందులో ముక్తేశ్వర్ ఆలయ పెయింటింగ్‌కు గాను తిరుపతి చిత్రకారుడు చిరంజీవికి ప్రథమ బహుమతి వచ్చిందని, అందుకుగాను రూ10,116 నగదు బహుమతి, చిత్రకళా భారతి పురస్కారాన్ని అందజేసినట్టు చెప్పారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,849మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,171మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,529మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 919, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 286మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 228మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 68మంది భక్తులు దోషనివారణ పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 18,673 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

నటించిన ప్రతి పాత్రకూ ప్రాణం పోయడం ఆయన ప్రత్యేకత. అందుకే వందకు పైగా పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించగలిగారు. నాటకరంగంలో ఔరా అనిపించుకుంటున్న ఆయన పేరు బుంగ మల్లికార్జున. చంద్రగిరి మండలం శానంబట్ల గ్రామానికి చెందిన ఈయన నాలుగు దశాబ్దాలుగా పాత్రోచితంగా నటిస్తూ అందరి మన్ననలందుకుంటున్నారు.




చంద్రమోహన్ నుంచి అందుకుంటున్న అవార్డు



తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)



నటనలోనూ ఆయన రైట్‌రైట్..

● వృత్తి,ప్రవృత్తుల్లో రాణిస్తున్న ఆర్టీసీ కండక్టర్ మల్లికార్జున

వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తనకు చిన్నప్పుడే ఎన్టీఆర్ పౌరాణిక పాత్రలు ప్రేరణగా నిలిచాయని చెప్పే మల్లికార్జున 1983లో బాలసుబ్రహ్మణ్యం వద్ద నటనలో శిక్షణ పొందారు. తొలిసారిగా ఎన్వీయాలో 'ఊహాజీవులు'లో కవి పాత్రతో నాటకరంగంలో ప్రవేశించారు. 'మంచంమీదమనిషి' నాటకంలో వైద్యుడి పాత్ర అవకాశం వచ్చింది. తర్వాత వెనకతిరగకుండా నాటకాల్లో నిలదొక్కుకున్నారు. డిగ్రీ పూర్తయ్యాక 1988లో ఆర్టీసీ కండక్టర్‌గా చేరారు. ఉద్యోగం చేస్తూనే నాటకరంగంలో వివిధ అవకాశాలను అందిపుచ్చుకుని ప్రేక్షకుల మన్ననలకు పాత్రులయ్యారు. 1994లో 'భక్తమార్కండేయ' వీధినాటంలో 'యముడు' పాత్ర అద్భుతంగా పోషించారు. జానపద గురువు ప్రకాష్‌రాజు, పౌరాణిక గురువు సుందరబాబుల శిష్యుడిగా ఇరవై ఏళ్లగా విభిన్న పాత్రలతో రాణించారు. శ్రీనివాసకల్యాణం నాటకంలో మహావిష్ణువు, వరాహమూర్తిగా ద్విపాత్రాభినయం చేసేవారు. ఇప్పటి వరకు మల్లికార్జున వందకు పైగా పాత్రలు ధరించారు. దాదాపు 250 నాటకాల్లో పాలుపంచుకున్నారు.



కేంద్రమంత్రి నుంచి మహాత్మగాంధీ అవార్డు అందుకుంటూ..



ఆర్టీసీ ఈడీ నుంచి అభినందనలు అందుకుంటున్న మల్లికార్జున

వందకుపైగా అవార్డులు: కళామతల్లి పుత్రుడిగా మల్లికార్జున 25కి పైగా పురస్కారాలు అందుకున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో కేంద్రమంత్రి మహమ్మద్‌ఖాన్ చేతులమీదుగా మహాత్మగాంధీ ఎక్సలెన్స్ అవార్డు తీసుకున్నప్పుడు మధురానుభూతి కలిగిందంటారు మల్లికార్జున. వివిధ రాష్ట్రాల్లో రెండుసార్లు రాష్ట్ర ఉత్తమనటుడు, అభినయ గాన గంధర్వ లాంటి పలు విశిష్ట పురస్కారాలు అందుకున్నారు.

ప్రేక్షకాదరణే అవార్డుగా..

మా గ్రామంలో పదిమంది నటులను తయారుచేశాను. వచ్చే ఏడాది రిటైర్ అవుతున్నా. తర్వాత పూర్తిసమయం నాటకాలకు వెచ్చిస్తాను. ఊపిరి ఉన్నంత వరకు నాటకాలు వేస్తుంటాను.పెద్ద అవార్డులు రాలేదని బాధపడేవాడినికాను. ప్రేక్షకుల చప్పట్లే ప్రోత్సాహాన్నిచ్చేవి.

-మల్లికార్జున

సివిల్ సర్వీస్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

తిరుపతి(క్రీడలు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీస్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు జట్లను ఎంపిక చేసినట్లు డీఎస్‌డీఈవో సయ్యద్‌సాహెబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 29, 30 తేదీలలో తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వారు ఈనెల 6నుంచి 9వ తేదీ వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఎంపికైన క్రీడాకారుల వివరాలిలా...

● క్రికెట్ : ఎస్.వెంకటేశ్వర్(కలెక్టర్), కె.ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్.లోకేశ్, కె.సురేష్, జి.పురుషోత్తం, ఎం.సురేష్, వి.తుకారాం, ఎస్.రమేష్‌నాయక్, మన్నెయ్య ●అథ్లెటిక్స్ : టి.యువజరాజ్, ఎం.సిసింద్రి, కె.శివకుమార్, బి.గిరిబాబు, ఎన్.పవన్‌కుమార్, ఎస్.కె.జావిద్, ఐ.మణెయ్య, ఎస్.వి.సుబ్బయ్య, వి.తుకారాం, ఎ.చంద్రబాబు, కె.సురేష్, డి.పవన్‌కుమార్, సి.రెడ్డెమ్మ, పి.ప్రియాంక, పి.కుమారి. ●హాకీ : ఎం.ప్రసన్నలక్ష్మి, ఎస్.జ్యోత్స్న, ఎల్.భార్గవి, పి.ప్రియాంక, పి.వరప్రసాద్. ●కబడ్డీ : ఎన్.హేమనాథరాజ్‌కుమార్, ఎ.భారతి, ఎస్.అజరుద్దీన్, వి.హరిప్రసాద్. ●పవర్‌లిఫ్టింగ్ : ఎం.వెంకటేష్, ఎ.సాయిప్రదీప్, ఎస్.కె.జావిద్ ●స్విమ్మింగ్ : ఎస్.చంద్రబాబు, ఎస్.కె.జావిద్ ●టెన్నిస్ : ఎస్.శ్రీరాఘవ, ఎస్.రమేష్‌నాయక్ ●టేబుల్ టెన్నిస్ : రెడ్డిప్రసాద్, సుకుమార్, వి.కిరణ్, ఎల్.భార్గవి, ఎం.ప్రసన్నలక్ష్మి ●వాలీబాల్ : ఎన్.సాయికౌషిక్, ఎస్.మణిగండ, ఎం.సురేష్, డి.పవన్‌కుమార్, ఎన్.పవన్‌కుమార్, కె.ప్రసన్న, పి.కుమారి ●కుస్తీ : ఎం.హేమంత్‌కుమార్, ఎం.వేణు, ఎ.సాయి ప్రదీప్, ఎస్.దర్శిని ●వెయిట్ లిఫ్టింగ్ : ఎ.కె.జావిద్ ●ఖోఖో : డి.పవన్‌కుమార్, ఎన్.ప్రవీణ్‌కుమార్, కె.సెల్వరాజ్, పి.ప్రియాంక ● బెస్ట్‌ఫిజిక్ : ఎం.వెంకటేష్, ఎస్.కె.జావిద్ ●యోగా : ఎ.సుబ్రహ్మణ్యం, ఎన్.మంజుల, జె.పుష్పలత, కె.వేదవతి, ఎం.సందీప్ ●క్యారమ్స్ : వి.శ్రీనివాసులు, ఎస్.లక్ష్మీకాంత్, ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్.రమేష్‌నాయక్, సుకుమార్, ఎం.సందీప్, ఎన్.మంజుల, జె.పుష్పలత ●చదరంగం : ఎం.నరేంద్రనాథచౌదరి, బి.గిరిబాబు, ఎం.సందీప్, ఎన్.మంజుల, జె.పుష్పలత ●ఫుట్‌బాల్ : ఎం.నవీన్‌కుమార్, వినోద్‌కుమార్ ●బ్యాడ్మింటన్ : శశిభూషణ్‌రావు, కె.వి.నాగేంద్ర, పి.కల్యాణ్, కె.గోపీనాథ్, ఎస్.ప్రసాద్, అబ్దుల్ అజీజ్, కె.వేదవల్లి, సి.రెడ్డెమ్మ.

రూ.30కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా

- రహస్యంగా గదుల నిర్మాణం
- తిరుపతి రూరల్ టీడీపీ నేత నిర్వాకం



కబ్జా స్థలంలో నిర్మించిన గదులు



కాలువపై ఏర్పాటు చేసిన రోడ్డు

తిరుపతి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర శివారు ప్రాంతాల్లో భూమి విలువ ఆకాశాన్నంటుతుండడంతో భూ బకాసురుల కన్ను అటువైపు పడింది. గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా సాగిన కబ్జాల పర్వం కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది. కాలువ పోరంబోకు, ప్రభుత్వ భూములను అన్వేషించి రెవెన్యూ అధికారుల సహకారంతో అక్రమించేస్తున్నారు. తిరుపతి రూరల్ మండలం మంగళం గ్రామ లెక్క దాఖలు, సర్వే నెంబరు 114లో దాదాపు రూ.30కోట్లు విలువైన ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. మంగళం-శెట్టిపల్లె 80 అడుగుల ప్రధాన రహదారికి పడమర దిశగా తిమ్మినాయుడుపాళెం, మంగళం చెరువుల నుంచి వచ్చే కాలువకు ఎగువన ఈ భూమిపై కన్నేసిన టీడీపీ తిరుపతి రూరల్ మండల నేత రాత్రికి రాత్రే చదును చేసి, వరుస క్రమంలో మూడు గదులను నిర్మించేశాడు. మరిన్ని నిర్మించడానికి మెటీరియల్ సిద్ధం చేసుకున్నాడు. వాహనాల రాకపోకలకు అనువుగా కాలువపై సిమెంట్ పైపులు పరిచి రోడ్డు సైతం ఏర్పాటు చేసుకున్నారు. కాలువ పోరంబోకులో గతంలో నిర్మాణాలు చేపట్టినా రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో విరమించుకున్నారు. ఈ ప్రాంతం జనసంచారానికి కాస్త దూరంగా ఉండడంతో యధేచ్ఛగా నిర్మాణాలు చేసేస్తున్నారు. చుట్టుపక్కల మండలాల్లో రెవెన్యూ భూములకు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నా ఇక్కడ మాత్రం కానరాలేదు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కృషి

● రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్

రేణిగుంట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కృషి చేస్తామని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ చెప్పారు. రైల్వేశాఖ ఆధ్వర్యంలో జరిగే 'ఆన్ ది స్పాట్ స్టడీ టూర్' నిమిత్తం జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం దూరంతో ఎక్స్‌ప్రెస్‌లో రమేష్ సారథ్యంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు రేణిగుంట రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. వీరికి సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్ఎం విజయకుమార్, తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షురాలు తేజోవతి ఘనస్వాగతం పలికారు. అనంతరం సీఎం రమేష్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని తిరుపతి, రేణిగుంట, గుంతకల్లు, గూడూరు, విజయవాడ, విశాఖపట్టణంతో పాటు హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు, సదుపాయాలను కల్పించే దిశగా చేపట్టాల్సిన అంశాలపై రైల్వే అధికారులతో సోమవారం చర్చిస్తామన్నారు. అలాగే రైల్వేస్టేషన్ల తనిఖీ కూడా ఉంటుందన్నారు. అనంతరం బీజేపీ రేణిగుంట మండల బీజేపీ అధ్యక్షురాలు తేజోవతి సంత గేటు వద్ద వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనా ఇంత వరకు పనులు మొదలుపెట్టలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.



రేణిగుంట రైల్వేస్టేషన్‌లో స్టాండింగ్ కమిటీ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

భీష్మయ్యనాయుడికి నేతల నివాళులు

● హాజరైన రాజకీయ, సినీ ప్రముఖులు

చంద్రగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీటీడీ విశ్రాంత హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బొబ్బా భీష్మయ్యనాయుడు కుటుంబ సభ్యులను పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పరామర్శించారు. గత నెల 21వ తేదిన ఆయన అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం ఆయన స్వగ్రామమైన చంద్రగిరి మండలం శేషాపురంలో కర్మక్రియలు జరిగాయి. విజయ్ ఎలక్ట్రానిక్స్ చైర్మన్ దాసరి జైరమేష్, తిరుపతి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, ఎస్సీవీ నాయుడు, కిమ్స్ హాస్పిటల్ ఎండీ బొల్లినేని భాస్కర్ రావు, సినీ నటుడు రఘుబాబు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, గాలి రాజేంద్రనాయుడు, ఆర్సీపురం మాజీ జడ్పీటీసీ దేవానందనాయుడు, సుధాకర్‌చౌదరి, భూపాల్‌నాయుడు, కిమ్స్ హాస్పిటల్ సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ సీఎస్ నాయుడు, టీటీడీ మాజీ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వాసుదేవనాయుడు తదితరులు హాజరయ్యారు. భీష్మయ్యనాయుడు చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబీకులను పరామర్శించారు.



భీష్మయ్యనాయుడు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విజయ్ ఎలక్ట్రానిక్స్ చైర్మన్ దాసరి జైరమేష్

భీష్మయ్యనాయుడు కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, సినీనటుడు రఘుబాబు



వైసీపీ కౌన్సిలర్‌పై వీఆర్వో ఫిర్యాదు

సూళ్లూరుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రాఘవయ్యపేట వీఆర్వో నీలిమ వైసీపీకి చెందిన 20వ వార్డు కౌన్సిలర్ మునీంద్రబాబుపై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల ఒకటో తేదీన 20వ వార్డు ఇసుకమిట్టలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సమయంలో తనను కౌన్సిలర్ అసభ్యంగా మాట్లాడి విధులకు ఆటంకం కలిగించాడని ఆమె పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సోషల్ మీడియాలో ఎమ్మెల్యేపై అసభ్యకర పోస్టులు

● వ్యక్తిపై కేసు నమోదు

చిల్లకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌పై అసభ్యకరమైన పదజాలంతో పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఆదివారం చిల్లకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. గూడూరు తూర్పువీధి ప్రాంతానికి చెందిన ఉన్నం వినీష్. టీడీపీ సీనియర్ నేత తానంకి నానాజీ ఫొటోతో ఫేస్ బుక్ ద్వారా ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు చేస్తూ, అసభ్యకర పదజాలంతో దూషించి ప్రచారం చేశారు. తానంకి నానాజీ అందుబాటులో లేకపోవడంతో ఆయన డ్రైవర్ నాగరాజు ఫిర్యాదు మేరకు వినీష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మినీలారీ - ఆటో ఢీ: ఒకరి మృతి



మృతి చెందిన ఆటో డ్రైవర్

తిరుచానూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు ఫ్లైఓవర్ మీద మినీలారీ- ఆటో ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. తిరుచానూరు ఎస్ఐ అరుణ తెలిపిన వివరాలు మేరకు.. బీఎన్‌కండ్రిగ మండలం అలత్తూరుకు చెందిన మనోహర్(43) ఆటో నడుపుతుంటాడు. ఆదివారం తిరుచానూరు పద్మశాలి భవన్ వైపు నుంచి రాంగ్‌రూట్‌లో తాజ్ హోటల్ వెళ్లడానికి ఫ్లైఓవర్ ఎక్కాడు. అదే సమయంలో చంద్రగిరి నుంచి నాయుడుపేటకు వెళుతున్న మినీలారీ వచ్చి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మనోహర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇతడు చనిపోయాడు. ప్రమాదం జరిగాక 108 వాహనం సకాలంలో రాలేదని అక్కడున్న వాహనచోదకులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 88.076 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 36,829 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

వైభవంగా తిరుమలనంబి శాత్తుమొర

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవ భక్తుడైన తిరుమల నంబి శాత్తుమొర ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీవారి తీర్థకైంకర్యాన్ని తిరుమలనంబి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆదివారం శ్రీవారి ఆలయం పక్కనే ఉన్న తిరుమలనంబి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామానుజాచార్యుల అంశతో జన్మించిన మనవాళ మహాముని శాత్తుమొర ఈనెల 6న జరుగనుంది. 9న అత్రి మహర్షి, పిళ్లైలోకాచార్య, పోయిగై ఆళ్వార్, శ్రీభూదత్తాళ్వార్ల తిరునక్షత్రోత్సవాలతో పాటు వేదాంత దేశికాచార్య శాత్తుమొర కూడా జరుగనుంది. 10న పేయాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 11న యాజ్ఞవల్క్య జయంతి జరుగనున్నాయి. తిరుమల శ్రీవారికి ఏడాది పొడవునా అనేక ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా, శ్రీవారి పరమ భక్తుల తిరు నక్షత్రోత్సవాలు కూడా టీటీడీ ఘనంగా నిర్వహించడం విశేషం.

రోటరీ క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవం



మాట్లాడుతున్న రోటరీక్లబ్ ప్రధాన కార్యదర్శి జలీల్ అహ్మద్

కోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోటలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో ఆదివారం రోటరీ క్లబ్ టౌన్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. రోటరీ క్లబ్ గవర్నర్ మునిగిరీష్, వాసుగౌడ్‌ల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహిం చారు. రోటరీక్లబ్ కోట టౌన్ అధ్యక్షుడుగా నెల్లూరుపల్లి కొత్తపాళెంకు చెందిన నెల్లూరు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోటకు చెందిన షేక్ జలీల్ అహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా మొదిన్‌బాషా, పసుపులేటి కిషోర్, కృష్ణమూర్తి, వంశీ, మధుయాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త పాలకమండలిని రోటరీ క్లబ్ ప్రతినిధులు, గవర్నర్‌లు అభినందించారు.

గోపీకృష్ణ కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ శనివారం ప్రమాదానికి గురైన మృతిచెందిన గోపీకృష్ణ కుటుంబానికి సంబంధిత కర్మాగార యాజమాన్యం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియాను అందించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక చవటపాళెం సమీపంలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో శనివారం షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గోపికృష్ణ అనే యువకుడు ప్రమాదానికి లోనై మృతిచెందడం విషాధకరమన్నారు. పరిశ్రమలో ఇటువంటి ప్రమాదకర ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోగి శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, శ్రీనివాసులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



గూడూరు, నవం బరు 3 (ఆంధ్రజ్యోతి): బలిజ విద్యార్థులకు ఆదివారం నెల్లూరు కాపు భవనంలో నగదు ప్రతిభా ప్రోత్సాహక బహుమతులను అంద జేసినట్లు బలిజ మహిళా సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మీ తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరం 10 తరగతిలో ప్రతిభచాటిన విద్యార్థులకు మంత్రి నారాయణ చేతులమీదుగా నగదు ప్రోత్సాహక బహు మతులు అందజేశామని, గూడూరు నుంచి ఆరుగురు విద్యార్థులు పురస్కా రాలను అందుకున్నారని పేర్కొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



గూడూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడవయ్యకాలనీలోని గాడ్‌గ్రేస్ సొసైటీ అనాథశరణాలయంలో ఆదివారం వృద్ధులకు బాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కూరపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ చలికాలంలో వృద్ధులకు, ఆశ్రయం పొందుతున్న వారికి ఇబ్బందులు లేకుండా దుప్పట్లను అందజేశామనానరు. జాన్‌పాల్, యశ్వంత్, రహంతుల్లా పాల్గొన్నారు.

డిసెంబరు 7న ఆదిశంకర విద్యార్థుల క్రికెట్ మ్యాచ్



గూడూరు, నవం బరు 3 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న ఆదిశంకర విద్యార్థుల క్రికెట్ మ్యాచ్ జరగ నుంది. దీనికి సం బంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆదివారం తన కార్యాలయంలో ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులందరూ ఓ వేదికగా కలవడం సంతోష దాయకంగా ఉంటుందన్నారు. స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో పూర్వపు విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల టీమ్‌లు తలపడడం మంచి సంప్రదాయమని పేర్కొన్నారు. ఆటలతో స్నేహ సంబంధాలు మెరుగవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీ గుడ్లూరు రవిచంద్ర, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ


అఖిలప్రియకు ప్రసాదాలు అందిస్తున్న సహాయ కమిషనర్

సూళ్లూరుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరు పేటలోని చెంగాళమ్మ పర మేశ్వరి అమ్మ వారిని ఆదివారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ దర్శిం చుకొన్నారు. ఎమ్మె ల్యే భూమాకు సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, బండారు ఆంజనేయులు, రమణయ్య పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారుడికి ఘన సన్మానం

నాయుడుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మలేషి యాలో జరి గిన మాస్టర్ అథ్లెటిక్ పోటీలలో నాయుడుపేటకు చెందిన గుంటూరు వెంకట రావు ప్రతిభ కనబరిచారు. వెంకట రావు ఆయన సతీమణిని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సురేష్‌బాబు ఆధ్వ ర్యంలో సత్కరించారు. హైజంప్ ఎలో బంగారు పతకం, ట్రిపుల్ జంప్‌లో వెండిపతకం, లాంగ్ జంప్, 200 మీటర్ల పరుగు పందెంలో నాల్గవ స్థానం సాధించిన వెంకటరావును అభి నందిం చారు. డీఎల్‌పీవో రవీంద్రబాబు, ఏవో భువనేశ్వరశర్మ, ఈవోపీఆర్‌డీ మల్లుగోపాల్, ఏపీఎం ఉమా దేవి, పరమశివం తదితరులు ఉన్నారు.



దూషించాడు.. ప్రశ్నిస్తే దాడిచేశాడు

బాలాయపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలకు పొరుగింటివారే కారణమని భావించి దూషణలకు దిగడంతో పాటు నిలదీసిన వారిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని జయంపు గ్రామానికి చెందిన ఆనం లక్ష్మయ్య శనివారం అర్ధరాత్రి బూతులతో రెచ్చిపోయాడు. తన ఇంట్లో గొడవలకు పక్కింటి శివ్వాడి జనార్ధన్‌రెడ్డి కుటుంబమే కారణమని దూషణలకు దిగాడు. దీన్ని భరించలేని జనార్ధన్‌రెడ్డి అతడిని నిలదీశాడు. దీంతో లక్ష్మయ్య అతడిపై కర్రతో దాడిచేశాడు. అడ్డుకోబోయిన ఆయన భార్య లలితమ్మ, కుమారుడు కల్యాణ రెడ్డిలపైనా దాడిచేసి గాయాలపాలు చేశాడు. గాయపడ్డ ముగ్గురినీ వైద్యం కోసం చెన్నైకు తరలించారు. ఎస్‌ఐ గోపి కేసు నమోదు చేశారు.

షిరిడి సాయిబాబా ఆలయంలో అన్నదానానికి రూ.10వేల విరాళం

నాయుడుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట బ్రాహ్మణవీధిలోని షిరిడి సాయిబాబా ఆలయ నిత్య అన్నదాన పథ కానికి లీలావతమ్మ రూ.10,011లు విరాళం అందజేశారు. గనగలూరి సుబ్బరామిరెడ్డి, వారి కుమారుల జ్ఞాపకార్థం ఈ నగదు అందజేశారు.

ఆంగ్ల సర్టిఫికెట్ కోర్సు శిక్షణకు హెచ్‌ఎం పెంచలయ్య ఎంపిక



దక్కిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరులోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆంగ్ల సౌత్ ఇండియా జ్ఞానభారతి క్యాంపస్‌లో 30 రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులకు దక్కిలి మండలం దేవుడువెల్లంపల్లి ఎస్టీకాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూడల పెంచలయ్యను ఎంపిక చేసినట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంగ్లీష్ సర్టిఫికెట్ కోర్సు 30 రోజుల పాటు జరుగుతుందన్నారు. ఇంగ్లీష్ సులభంగా బోధించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 25 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొంటారని చెప్పారు. తిరుపతి జిల్లా నుంచి దక్కిలి, పెళ్లకూరు మండలాలకు చెందిన దూడల పెంచలయ్య, బాలసుబ్రమణ్యం అనే ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు వివరించారు. శిక్షణ పూర్తయిన తర్వాత వారు ఇక్కడి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారని తెలియజేశారు.

మత్స్యకారులకు టీడీపీ సభ్యత్వాలు



కోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలోగల గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామంలో ఆదివారం టీడీపీ సభ్యత్వం ముమ్మరంగా సాగింది. ఆ పార్టీ సీనియర్ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామంలోని పలువురు కాపులు స్వచ్ఛందంగా సభ్యత్వాలు స్వీకరించారు. టీడీపీ సభ్యత్వం వల్ల కలిగే ఉపయోగాలు, బీమా సౌకర్యాల గురించి ఆయా నాయకులు వివరిస్తూ సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెంగల్‌రావు, మురళి, చల్లా సురేష్, వెంకయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల చోరీ.. కేసు నమోదు

నాయుడుపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లోతువానిగుంట స్వర్ణముఖినది సమీపంలో మున్సిపాలిటీకి సంబంధించిన 5 విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి



వాకాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపురం గ్రామం శివార్లలో ఆదివారం కోడిపందేల స్థావరంపై ఎస్‌ఐ నాగబాబు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1390 నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశారు.

మంత్రిని కలిసిన జనసేన నాయకులు



గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రమంలో ఆదివారం మంత్రి నాదెళ్ల మనోహర్‌ను గూడూరు జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గూడూరు నియోజకవర్గ పరిధిలో జనసేన బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, కూటమి ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచిం చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కొణిదల మునిగిరీష్, పేటేటి చంద్రనీల్, కొమ్మా రవీంద్రబాబు, ఇంద్రవర్ధన్‌కుమార్, నయూం, హసన్ పాల్గొన్నారు.



ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు, గూడలిలో సంగమేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న పండితులు

అంకమ్మకు సహస్ర దీపాలంకరణ

కోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణ పరిధిలోని శ్యామసుందర పురంలో గల గ్రామ దేవత అంకమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి కార్తీకమాస పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలను వెలిగించారు. మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షిదేవి సమేత సంగమేశ్వర ఆలయంలో ఆదివారం కార్తీకమాస పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేసి విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి ఆధ్వర్యంలో సంగమేశ్వరుడు, కామాక్షి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం జరిగింది. భక్తులు స్వామి, అమ్మవార్లకు కర్పూర హారతులు సమర్పించారు.

గూడూరు 3వ వార్డులో సమస్యల తిష్ట

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక 3వ వార్డులో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు, రోడ్లు అధ్వానంగా మారడంతోపాటు వీధి దీపాలు వెలగడం లేదు. పట్టణంలోని 3వ వార్డులో జనార్దన్‌రెడ్డికాలనీ, సాధుపేట, చాకలి వీధి తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో 600లకు పైగా నివాసగృహాల్లో సుమారు 2000మంది వరకు జీవనం సాగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ వార్డులో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టక పోవడంతో సమస్యలు తిష్టవేశాయని స్థానికులు చెబు తున్నారు. ప్రధానంగా జనార్దన్‌రెడ్డికాలనీలో సీసీ రోడ్లు ధ్వంసమై ఉన్నాయి. కల్వర్టుకు మధ్యలో భారీ గోతులు ఏర్పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయాల్లో కల్వర్టుకు ఉన్న గుంత కనిపంచక పోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహన దారులుప్రమాదాలబారిన పడుతున్నారు. చాకలివీధిలో కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేవు. మట్టిరోడ్లు దర్శన మిస్తున్నాయి. డ్రైనేజీ కాలువలు పూర్తిగా అభివృద్ధిపరచకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్వాసన భరించలేకున్నారు. దోమలు పెరిగి విషజ్వరాలు సోకుతున్నాయని వాపోతున్నారు. సాధుపేటలో వీధిదీపాలు సక్ర మంగా వెలగకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారం అలముకుంటోంది. విషసర్పాల భయం వేధిస్తోంది. అధికారులు స్పందించి 3వ వార్డులోని సమస్యలను పరిష్కరించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




చాకలివీధిలో అధ్వానంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ కాలువలు ● జనార్దన్‌రెడ్డి కాలనీలో కల్వర్టుకు ఏర్పడిన గుంత ● సాధుపేటలో వెలగని వీధి దీపాలు

నేరాల నియంత్రణకు కార్డెన్ సర్చ్


కార్డెన్‌సర్చ్ కార్యక్రమంలో పోలీసులు

గూడూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు కార్డెన్ సర్చ్ కార్యక్రమం నిర్వహించామని పోలీస్ అధికారులు తెలిపారు. ఆదివారం స్థానిక అడవయ్యకాలనీ ప్రాంతంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఎవరైనా కొత్త వ్యక్తులు, అను మాని తుల సంచారం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కొత్తవ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇచ్చే సమయంలో వారి పూర్తి వివరాలను పరిశీలించి ఇవ్వాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పలు వాహనాలను తనిఖీ చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస్, శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, ఎస్‌ఐలు మనోజ్‌కుమార్, సురేష్ బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● రెండోపట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు.

అనుమానితుల సమాచారం ఇవ్వాలి: డీఎస్పీ

నాయుడుపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా అనుమానిత వ్యక్తులు వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. నాయుడుపేట - మేనకూరు పారిశ్రామిక వాడలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో ఆదివారం ఉదయం డీఎస్పీ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మేనకూరు సెజ్‌లోని పరిశ్రమల్లో పనిచేసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి కార్మికులు వచ్చి నివాసం ఉండటంతో కార్డెన్ సెర్చ్ నిర్వహించి వారి వివరాలను తెలుసుకొని వారి ఐడి కార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వేధింపుల విషయంలో మహిళలు నిర్భయంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. వాహనదారులు అన్ని ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. అర్బన్ సీఐ బాబి, ఎస్‌ఐలు అజయ్‌కుమార్, శ్రీహరిబాబు, సిబ్బంది ఉన్నారు.


మేనకూరులో కార్డెన్ సెర్చ్‌లో విచారిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

మాంబట్టులో స్విమ్స్ మెగా వైద్య శిబిరం


మందులను అందజేస్తున్న స్విమ్స్ వైద్యులు మునస్వామి, గ్రామపెద్దలు

తడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాంబట్టు పంచాయతీ చిన్నమాంబట్టు దళితవాడలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తిరుపతి సిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ వైద్యశిబిరంలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ వంటి 8 ప్రత్యేక వైద్యసేవలు అందించే వైద్యులు చికిత్సలు అందించారు. అలాగే పింక్‌బస్సు ద్వారా మమోగ్రామ్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. సుమారు 300 మంది రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన స్విమ్స్ వైద్యులు మునస్వామి, సర్పంచ్ రమణయ్య, గ్రామపెద్దలు వేనాటి రాజారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, పురుషోత్తం, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



చిల్లకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలం లోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలిసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి నైవేద్యం నివేదించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సమస్యల వలయంలో ఆర్యభట్టనగర్

సూళ్లూరుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఆర్య భట్టనగర్ సమస్యల వలయం లో చిక్కుకుంది. ఇక్కడ సామాన్య జనంతో పాటు విశ్రాంత షార్, ఇతర ఉద్యోగులు నివాసం ఉంటున్నారు. మున్సి పాలిటీ పరిధిలోకి వచ్చినా కనీస వసతులు కూడా లేదు. సీసీ రోడ్లు లేక పోవడంతో చిన్నపాటి వర్షమొచ్చినా ఉన్న మట్టి రోడ్లు రొచ్చురొచ్చుగా మారుతున్నాయి. నివాసాల నడుమ ఉన్న ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఖాళీస్థలాల్లో ఇటు మురుగునీరు, అటు వర్షపు నీరు నిలిచిపోయి దోమలకు, పందులకు అవాస కేంద్రాలుగా మారుతున్నాయి. తాగునీరు కూడా కాలనీ వాసులకు సక్రమంగా అందడం లేదు. రెండు రోజుకొకసారి మాత్రమే మున్సిపాలిటీ నీరు అందుతోందని కాలనీ వాసులు చెబుతున్నారు. ఇళ్ల మధ్యలో పలుచోట్ల ముళ్ల పొదలు పెరిగిపోయాయి. ఎక్కడచూసినా మురుగు దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.




ఇళ్ల మధ్యవున్న ఖాళీ స్థలంలో నిలిచిపోయిన మురుగునీరు, నివాసాల నడుమ దట్టంగా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, సీసీ రోడ్లు లేక ఇలా ఉన్న మట్టిరోడ్లు

మా కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మించరా?


సిమెంటు రోడ్డు లేని కొత్తకాలనీ

కేవీబీపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొత్తకాలనీ ఏర్పడి పది సంవత్సరాలైంది. ఇంత వరకు సిమెంటు రోడ్లు నిర్మించలేదు. తాగునీటి వసతి కల్పించలేదు. వీధి దీపాల ఊసే లేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా పల్లెపండుగ పేరుతో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. మండలంలోని తిమ్మసముద్రం, వగత్తూరు, రాజులకండ్రిగ, పూడి గ్రామాలు, కేవీబీపురంలోని కొన్ని ప్రాంతాల్లో గతంలో నిర్మించి మరమ్మతులకు గురైన రోడ్లనే నిర్మిస్తున్నారని తమ కొత్తకాలనీని పట్టించుకోవడం స్థానికులు వాపోతున్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో కాలనీ ఉండడంతో తరచూ విషపురుగుల సంచారం ఎక్కువగా ఉందంటున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి తమ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

హోంమంత్రికి ఘనస్వాగతం


విమానాశ్రయంలో హోంమంత్రికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

ఏర్పేడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వి.అనితకు తిరుపతి విమానాశ్రయంలో ఏర్పేడు మండల టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. వడమాలపేట మండలంలో హత్యాచారానికి గురైన చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయాన్ని అందించడానికి ఆదివారం హోం మంత్రి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పేడు టీడీపీ నేతలు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గాలి కృష్ణవేణి ఆధ్వర్యంలో స్వాగతం పలికి సన్మానించారు.

కేవీబీపురం: హోం మంత్రి వంగలపూడి అనితకు ఆదివారం కేవీబీపురం మండల టీడీపీ నాయకులు, టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, తిమ్మసముద్రం సర్పంచు దొరబాబునాయుడు, ఓళ్ళూరు సర్పంచ్ సురేష్ చౌదరి, పాల ఏకిరి సంఘం కన్వీనర్ వెంకటకృష్ణయ్య, మస్తాన్, శ్రీనివాసులు తదితరులు ఘనస్వాగతం పలికారు. తమ మండల వాసిని హత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించేలా సత్వరం చర్యలు చేపట్టాని ఆమెను కోరారు.

రైల్వేలో చేనేత వస్త్రాలకు ప్రాధాన్యం కల్పించండి


రమేష్‌కు చేనేత రాట్నం బహూకరిస్తున్న గుత్తి త్యాగరాజు

వరదయ్యపాళెం, నవంబరు 3(అంధ్రజ్యోతి): రైల్వే శాఖలో చేనేత వస్త్రాలను వినియోగించేలా ప్రాధాన్యం కల్పిస్తూ ప్రోత్సహించాలని జాతీయ చేనేత ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడు గుత్తి త్యాగరాజు అనకాపల్లి ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్‌కు విన్నవించారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రమేష్‌కు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్‌ను త్యాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. రమేష్‌కు చేనేత రాట్నాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండుగలా ఆకాశదీపం


ఆకాశదీప పూజల్లో ఈవో తదితరులు - ఆకాశ దీపాన్ని ఎగురవేస్తున్న ఈవో తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాశదీపం కన్నుల పండువగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజూ ఆకాశదీపాన్ని వెలిగించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఎగురవేశారు. భక్తులు ఆకాశ దీపాన్ని దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

గుంతల్లోనే గ్రామీణుల ప్రయాణం


అధ్వానంగా ఉన్న ఎనమలపాళెం, వసంతనగర్ రోడ్లు

వడమాలపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన రహదారులుగా ఉన్న రెండు రోడ్లు గుంతలు, రాళ్లతో తేలిపోయి ప్రయాణం నరకప్రాయమవుతోంది. రోడ్లు భవ నాల శాఖ ఆధ్వర్యంలోని తిరుమణ్యం - ఎనమల పాళెం రోడ్డు, పంచాయతీరాజ్ పరిధిలోని ఓబీఆర్ కండ్రిగ - వసంతనగర్ రోడ్డు గత కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోక తారు లేచిపోయి రాళ్లు తేలి రాకపోకలకు ప్రమాదకరంగా మారాయి. ఈ రెండు రోడ్లు సుమారు ఇరవై గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులే. ఎనమల పాళెం రోడ్డు మీదుగా సీతారామపురం, అప్పలాయగుంట, రామచంద్రాపురం మండలా నికి వెళ్లే రోడ్డు, కాగా ఓబీఆర్ కండ్రిగ రోడ్డు వసంతనగర్ మీదుగా అటు తడుకు రైల్వేస్టేషన్ మీదుగా పుత్తూరు, ఇటు వడమాలపేటకు అప్పలాయగుంటకు దగ్గరి దారి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్లపై ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే భయపడుతున్నారు. ఆటో డ్రైవర్లు ఈ రోడ్లపై బాడుగకు రావడం లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా బాగుపడుతుందేమోనంటూ ప్రజలు కోరుతున్నారు.

రేపు నాగుల చవితి వేడుకలు

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో మంగళవారం నాగుల చవితి వేడుకలను నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6గంటలకు తిరుమంజనం గోపురం సమీపంలోని నాగులపుట్ట వద్ద ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

నాడు కిట కిట... నేడు వెల వెల!

ఖాళీగా కన్పిస్తున్న బైపాస్ రోడ్డు


వాహనాలు లేక నిర్మానుష్యంగా ఉన్న బైపాస్‌రోడ్డు

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నెల రోజుల ముందు వరకు ట్రాఫిక్‌తో ప్రజలు ఈ మార్గంలో విలవిలలాడిపోయారు. కొత్త ఆరులేన్ల జాతీయ రహదారి ప్రారంభం కావడంతో ప్రస్తుతం బైపాస్ రోడ్డు వెలవెలబోతోంది. శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీకి ఆనుకుని సుమారు 25ఏళ్ల క్రితం పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బైపాస్ రోడ్డును ఏర్పాటు చేశారు. ఆ తరువాత రహదారిపై వాహనాల రాకపోకలు విపరీతంగా పెరుగుతూ వచ్చింది. గడచిన పదేళ్ల నుంచి ఈ బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తారస్థాయికి చేరింది. అడుగు తీసి అడుగు వేసేందుకు కూడా వీల్లేనంత వాహనాలు స్తంభించి పోయేవి. సాయంత్రం, రద్దీ వేళల్లో ఈ రోడ్డులో వాహనాలు కిలోమీటర్ల మేర స్తంభించిపోయేవి. అలాగే రోడ్డు ప్రమాదాలు సంభవించిన సమయంలో ఈ బైపాస్ రోడ్డులో ఇటు తిరుపతి వైపు మరో పక్క నాయుడుపేట వైపు పది కిలోమీటర్ల మేర వాహనాలు గంటల పాటు నిలబడిపోయిన సందర్భాలున్నాయి. ఒక్కోసారి మిట్ట మధ్యాహ్నం మలమల మండే ఎండలో వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు ఉక్కపోతతో విలవిలలాడిపోయేవారు. బైపాస్‌రోడ్డులో ట్రాఫిక్ నుంచి బయటపడే మార్గం లేక నెత్తినోరు మొత్తుకునే వారు. ఈ క్రమంలో 2017 సంవత్సరం నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు ఆరులేన్ల జాతీయ రహదారి నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రోడ్డు కోసం సర్వే చేసింది. 20రోజుల క్రితం ఆరులేన్ల జాతీయ రహదారి పూర్తయింది. పట్టణ శివార్లలోని చెర్లోపల్లి నుంచి ఊరందూరు మీదుగా కొత్త రహదారి నిర్మాణం జరిగింది. వాహనాలను కొత్తమార్గంలో మళ్లించడంతో పాత బైపాస్‌రోడ్డులో రద్దీ కనుమరుగైంది. మొన్నటి వరకు నిత్యం ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాలతో నెత్తురోడిన బైపాస్‌రోడ్డు నేడు ప్రశాంతంగా మారడం చర్చనీయాంశమైంది.

తెలంగాణ సీఎంతో బొజ్జల సుధీర్ భేటీ



శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదివారం భేటీ అయ్యారు. శ్రీకాళహస్తిలో తెలంగాణ భవన్ ఏర్పాటుపై చర్చించారు. ఈ భేటీలో కాంగ్రెస్ సీనియర్ నేత ఝాన్సీ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇటీవల పలు రాష్ట్రాల అతిథి గృహాలను శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేస్తామని చెప్పిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తెలంగాణ సీఎం తెలంగాణ అతిథిగృహ నిర్మాణానికి అంగీకరించారని ఇందుకోసం ఆలయ పరిసరాల్లో అర ఎకరా కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ సీఎంని కలిసి చర్చించడం శుభ పరిణామమని పట్టణ ప్రజలు అంటున్నారు.

ఎన్టీఆర్ నగర్‌లో కార్డన్ సెర్చి



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో కార్డన్ సెర్చిని ఎస్ఐ విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించిన వాహనాలను, రికార్డులు లేని వాహనాలను, ప్రమాదానికి కారణమైన వాహనాలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా వాహనదారుడిని అదుపులోకి తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని పలు ద్విచక్రవాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. పత్రాలు చూపించి వాహనాలు తీసుకుపోవాలని తెలిపారు.

ట్యాక్స్ చెల్లింపు తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు ట్యాక్స్‌తో పాటుగా ఇతర ట్యాక్స్‌లను చెల్లించాలని శ్రీకాళహస్తి మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర నాయుడు చెప్పారు. బుచ్చినాయుడు కండ్రిగ పోలీసుస్టేషన్ సమీపంలో ఆదివారం వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాహనదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ట్యాక్సు చెల్లించాలని లేకపోతే రెండు వందల శాతం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ఆటోలను నడపకూడదన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఎంపీ రమేష్‌కు ఘనస్వాగతం


లక్ష్మణ్, సీఎం రమేష్‌ను సన్మానిస్తున్న కోలా ఆనంద్ తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్ర జ్యోతి): రైల్వే స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కు ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం లభించింది. ప్రత్యేక రైలులో పార్లమెంటరీ కమిటీతో కలిసి రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న వారికి ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా కోలా ఆనంద్ నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి, రేణిగుంట, ఏర్పేడు, రాచగున్నేరి, మామండూరు రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాలు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. వారు అందుకు సానుకూలంగా స్పందించినట్లు ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి, టీడీపీ నాయకులు చంద్రయ్యనాయుడు, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖ మంత్రికి సాదర వీడ్కోలు



రేణిగుంట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్‌కు జనసేన నాయకులు సాదర వీడ్కోలు పలికారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు పయనం కాగా ఆయనకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి కోట వినుత, నాయకులు సాదర వీడ్కోలు పలికారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


కందాడు, ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఏర్పేడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2013-14లో టెన్త్ చదివిన విద్యార్థులు అపూర్వ కలయిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తమకు విద్యా బుద్ధలు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానిం చారు. అదే విధంగా ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-99 పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది.

భక్తిపారవశ్యంలో ముంచెత్తిన శివకీర్తనలు



గీతాలు ఆలపిస్తున్న మహిళలు

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని బ్రహ్మగుడి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నెల్లూరుకు చెందిన సురభి మహాలక్ష్మి సత్సంగ బృందం ఆలపించిన శివకీర్తనలు భక్తులను అలరించాయి. ఆలయ అధికారులు వారికి జ్ఞాపికలు అందజేశారు.

హోంమంత్రితో మాజీ మంత్రి భేటీ



వడమాలపేట, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎం పురంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనితను మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బాధిత కుటుంబానికి సాయం చేయ డంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రద్ధ చూపడం సంతోషకరమని చెప్పారు. సీఎంగా చంద్రబాబు అప్పుల ఊబి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్నారని చెప్పడంతో మంత్రి అనిత మాట్లాడుతూ మీలాంటి సీనియర్ నాయకులు ప్రోత్సాహం ప్రభుత్వానికి బలంగా ఉంటుందని చెప్పారు.

జమిలి ఎన్నికలతో అధికారం మనదే

ఉమ్మడి జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా భూమన ప్రమాణ స్వీకారం



తిరుపతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు 2027లో వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని, కూటమి ప్రభుత్వ వ్యతిరేకతే మనల్ని అధికారంలోకి తీసుకొస్తుందని వైసీపీ ముఖ్యనేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలో ఆదివారం చంద్రగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. భూమన సారథ్యంలో పార్టీ బలపడాలని వైసీపీ సీనియర్ నేతలు వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణా రెడ్డి, అంబటి రాంబాబు, రోజా తదితరులు ఆకాంక్షించారు. కార్యకర్తల సంక్షేమం, పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని నూతన అధ్యక్షుడు చెప్పారు. అందరి సూచనలతో ముందుకు వెళతామని చెప్పారు. జిల్లాలో వైసీపీ నాయకుల గ్రూపు రాజకీయాలపై మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అసంతృప్తి వ్యక్తంచేస్తూ, ఇప్పటికైనా ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరారు. చంద్రగిరిలో మోహిత్‌ను ఓడించడానికి 25 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు శ్రమించారన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రమాణోత్సవానికి హాజరుకాకపోవడంపై చర్చ జరిగింది. ఆయన కుటుంబ సభ్యుల వివాహ నిశ్చితార్థ కార్యక్రమానికి వెళ్లడంతో రాలేకపోయారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన పంపిన సందేశాన్ని కరుణాకరరెడ్డి చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ భరత్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మేయర్ శిరీష, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి


శ్రీనివాసులునాయుడు (ఫైల్ ఫొటో)

కేవీబీపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుల కండ్రిగకు చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాసులు నాయుడు(78) శనివారం అర్ధరాత్రి ఆకస్మికంగా మరణించారు. ఆయన ప్రస్తుత మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజులు నాయుడికి సోదరుడు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు, తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, పిచ్చాటూరు మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, దుష్యంత్‌రాజు తదితరులు రాజుల కండ్రిగకు చేరుకుని శ్రీనివాసులు నాయుడు భౌతికకాయానికి నివాళులర్పించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం


మొక్కల పెంపకంపై సూచనలిస్తున్న పార్వతి

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సహాయ కమిషనర్ పార్వతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపు నిచ్చారు. పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. జిల్లా యూత్ చైర్మన్ అజారుద్దీన్ మాట్లాడుతూ.. పాఠశాలల ఆవరణలో మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్లు ధనుష్, జనార్దన్, లీడర్లు శ్రీనివాసులు, నితిన్, తనూజ్, స్కౌట్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

భూమనకు సన్మానం



శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా పదవీబాధ్యతలు చేపట్టిన భూమన కరుణాకరరెడ్డిని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆదివారం సన్మానించారు. ఆయనకు ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. పార్టీ పటిష్ఠత కోసం సైనికుల్లా పని చేయాలని శ్రీనివాసులుకు భూమన కరుణాకర్‌రెడ్డి సూచించారు.

ఎమ్మెల్యే సోమిరెడ్డికి ముక్కంటి ప్రసాదాలు


సోమిరెడ్డితో కన్నలి ప్రవీణ్‌రెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని ఆదివారం శ్రీకాళహస్తికి చెందిన కన్నలి ప్రవీణ్‌రెడ్డి నెల్లూరు నగరంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను ఘనంగా సన్మానించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.